క్లుప్తంగా

పాడి రైతులకు బోనస్ పంపిణీ



నూజివీడు: మండలంలోని జంగంగూడెంలో పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం బోనస్‌ను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ 135 మంది పాడి రైతులకు రూ.4,16,215ను అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు డీవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు హాజరై మాట్లాడారు. పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయమన్నారు. అంతేకాక రైతుల ప్రయోజనాల కోసమే నిరంతరం పాటుపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కిలారి కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ పి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురంలో మృతిచెందిన ఎస్ చిన్నా అనే వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను గ్రామ సర్పంచ్ గొల్లమందల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, సచివాలయ సిబ్బంది అందజేశారు. బీమా సొమ్ము కూడా త్వరలో అందజేస్తామని పేర్కొన్నారు.

పొందుగలలో..

పొందుగల(మైలవరం): మైలవరం మండలం పొందుగల గ్రామానికి చెందిన నక్కనబోయిన తిరుపతమ్మ(35) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వైఎస్సార్ బీమా మంజూరు కావడంతో రూ.10 వేలు మట్టి ఖర్చులు నిమిత్తం పంచాయతీ సిబ్బంది బుధవారం అందజేశారు. మృతురాలికి ఎవరూ లేకపోవడంతో ఆమె వదిన ధనలక్ష్మికి బీమా సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చలపతిరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉర్దూ టీచర్‌గా షహనాగ్ బేగం



ఊటుకూరు(గంపలగూడెం): గంపలగూడెం మండల జింకలపాలెం మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు షేక్ షహనాగ్ బేగం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ వారిచే ఈ ఎంపిక చేశారు. ఈ నెల 11వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో ఆమె పురస్కారం అందుకొన్నారు. 15 ఏళ్లుగా ఉర్దూ భాష అభివృద్ధికి ఆమె పలు సృజనాత్మక కార్యక్రమాలు చేపట్టంతో పాటు సొంత యూట్యూబ్ చానల్ తెలుగు శాన్ టీవీ ద్వారా ఉర్దూ భాషను మరింత పటిష్టం చేసేందుకు తన వంతు ప్రయత్నం చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు పాఠశాల స్థాయిలో వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

మైలవరం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సర్పంచ్ జే జ్యోతి పేర్కొన్నారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ప్రభుత్వం ద్వారా ఐదు పాఠశాలలకు సరఫరా అయిన వంట సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం తీసుకుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆశీస్సులతో ఈ రోజు చంద్రాల పంచాయతీ పరిధిలోని ఐదు పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. విద్యార్థులు చేతులు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

వృత్తిపరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

నూజివీడు: ఉపాధ్యాయులు నిరంతరం వృత్తిపరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు, నూతన బోధన పద్ధతులను తెలుసుకునేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు దోహదపడతాయని డీవైఈఓ ఎం.సేవియా అన్నారు. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలకు చెందిన స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు బుధవారం పట్టణంలోని డీవైఈఓ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ సబ్జెక్టుల వారీగా నిర్వహిస్తున్నందున ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా బోధన చేసే పద్ధతులను, సబ్జెక్టుకు సంబంధించిన నూతన కంటెంట్‌పై అవగాహన పెంచుకోవడం ఉపాధ్యాయులకు ఎంతో అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని, బోధనలో సాంకేతిక విధానాన్ని తీసుకొచ్చిందని, దీనిని ఉపయోగించి విద్యార్థులకు సరళమైన పద్ధతిలో సులువుగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. పేద విద్యార్థులను ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంఈఓ–1,2లు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్, వీఎస్‌వీ బ్రహ్మాచారి, బీవీఎస్ సుబ్బారావు, సంగెపు జమలయ్య తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఈఓ సేవియా

నిబంధనల మేరకు దుకాణాలకు అనుమతి

తిరువూరు: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయదలచినవారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తిరువూరు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక బైపాస్ రోడ్డులో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు నిర్ణయించిన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖల నుంచి అనుమతులు పొందిన తర్వాత స్టాల్స్ నిర్మించుకోవాలని తహసీల్దారు సూచించారు. దుకాణాల వద్ద ప్రమాదాల నివారణకు ఇసుక, నీరు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తొమ్మిది మంది దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దారు తెలిపారు. తిరువూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ నబీ, ఎస్‌ఐ పద్మారావు, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణం పరిశీలన

సత్యాలపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం సత్యాలపాడులో నిర్వహిస్తున్న దీపావళి టపాసులు హోల్‌సేల్ దుకాణాన్ని మైలవరం ఏసీపీ రమేష్‌బాబు బుధవారం పరిశీలించారు. ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన దుకాణం నిర్వాహకులకు వివరించారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎస్‌ఐ రాంబాబు పాల్గొన్నారు.



తిరువూరులో బాణసంచా దుకాణాల అర్జీదారులకు సూచనలిస్తున్న తహసీల్దార్, సీఐ



సత్యాలపాడులో దీపావళి సామాన్ల హోల్‌సేల్ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రమేష్

నేటి నుంచి 'పల్లెకు పోదాం'

చాట్రాయి: ప్రభుత్వం నిర్వహించే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని మండలంలో గురువారం నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దుర్గాప్రసాదు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 9న చనుబండ 2, 10న చనుబండ 1, 14న బూరుగుగూడెం, 15న చిన్నంపేట, 16న చిత్తపూరు 1, 17న చిత్తపూరు 2, 20న జనార్దనవరం, 21న కోటపాడు, 22న కొత్తగూడెం, 23న మర్లపాలెంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అనుముల్లంకలో..

అనుముల్లంక(గంపలగూడెం): ఏపీకి జగనే ఎందుకు కావాలంటే (పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని గురువారం మండలంలోని అనుముల్లంకలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. సాయంత్రం మూడు గంటలకు జరిగే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లెకుపోదాం కార్యక్రమం ఈ నెల 9నుంచి 23వ తేదీ వరకు మండలంలోని వివిధ గ్రామాలు, మున్సిపాల్టీ సచివాయాల పరిధిలో జరుగుతుందని ఎంపీడీఓ రామకృష్ణా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటుపల్లి సచివాలయం–1 వద్ద గురువారం మధ్యాహ్నం జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న పాల్గొనే పల్లెకుపోదాం కార్యక్రమాలను స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు విజయవంతం చేయాలని కోరారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ బుధవారం తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పల్లెకు పోదాం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

నూజివీడు: మండలంలోని ముక్కొల్లుపాడులో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. సచివాలయం వద్ద మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి ఇప్పటి వరకు నాలుగున్నర సంవత్సరాల పాలనలో గ్రామానికి చెందిన లబ్ధిదారులకు చేకూర్చిన లబ్ధి, అభివృద్ధి పనుల వివరాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

తిరువూరు మండలంలో..

తిరువూరురూరల్: తిరువూరు మండలంలో గురువారం నుంచి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. 9న కాకర్ల, 10న లక్ష్మీపురం, 14న ఆంజనేయపురం, 15న చౌటపల్లి, 16న కొత్తూరు, 17న గానుగపాడు, 20న చింతలపాడు, 21న కొమ్మిరెడ్డిపల్లి, 22న ముష్టికుంట్ల, 23న రోలుపడి గ్రామ సచివాలయాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేడు 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: రెండో వార్డు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు కొండపల్లి వైఎస్సార్ సీపీ కన్వీనర్ మిక్కిలి శరభయ్య బుధవారం తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించడంతో పాటు అవన్నీ మళ్లీ అమలు కావాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ప్రజలకు తెలియజేయాలన్నారు. కౌన్సిలర్‌లు, అధికారులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

రెడ్డిగూడెం: ఎస్సీ వర్గీకరణను తక్షణమే చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ రెడ్డిగూడెం మెయిన్ సెంటర్లో ఆ సభ వాల్‌పోస్టర్లను బుధవారం ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మల్లాది రామారావు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు నాగేశ్వరరావు, పల్లెపాం రమేష్, రవి, వైస్ ఎంపీపీ రాబర్టు, శ్యాంబాబు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులతో రైతులకు మేలు

చంద్రాల(మైలవరం): రైతులకు తాము పండిస్తున్న పంటలపై సాంకేతిక నిపుణులతో ఏర్పాటు చేస్తున్న అవగాహన సదస్సులు ఎంతో మేలు కలుగుతుందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామ సచివాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో గంగాధరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో తక్కువ రేట్లకు నాణ్యమైన విత్తనాలు, మందులు సరఫరా జరుగుతోందని తెలిపారు. గరికపాడు సాంకేతిక నిపుణుల ద్వారా పత్తిలోని లద్దె పురుగు, పచ్చదోమ, పేనుబంక నివారణ చర్యలు, లింగాకర్షక బుట్టల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జే జ్యోతి పాల్గొన్నారు.



చంద్రాల గ్రామంలో జరిగిన రైతు అవగాహన సదస్సులో పాల్గొన్న గంగాధరరావు, సాంకేతిక నిపుణులు

కంభంపాటి సేవలు వెలకట్టలేనివి

నూజివీడు: పల్లెర్లమూడి గాంధీగా పేరుగాంచిన దివంగత మాజీ సర్పంచ్ కంభంపాటి వెంకయ్య, నారాయణమ్మ దంపతుల విగ్రహాల ప్రతిష్ట బుధవారం గ్రామంలో నిర్వహించారు. ప్రతిష్టించిన విగ్రహాలను స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ సభ్యుడు తుమ్మల రమేష్ చంద్రబోస్, కంభంపాటి గోవర్ధన్ రావు, కంభంపాటి శ్రీమన్నారాయణ, కంభంపాటి రవికుమార్, నందమూరి శోభారాణి, విశ్వేశ్వర దంపతులు, కంభంపాటి రాజా, లింగం రాణి దంపతులు, కొడాలి ప్రమీలా రాణి దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కంభంపాటి వెంకయ్య పల్లెర్లమూడి గ్రామాభివృద్ధికి చేసిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు యనమదుల దాసు, అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి రమేష్, ఆళ్ల గోపాలకృష్ణ, ఉప్పలపాటి శ్రీనివాసరావు, కంభంపాటి రమేష్ పాల్గొన్నారు.



ఆవిష్కరించిన కంభంపాటి వెంకయ్య, నారాయణమ్మ దంపతుల విగ్రహాలు

లకిరెడ్డి బాలిరెడ్డికి ఘన నివాళి

వెల్వడం(మైలవరం): లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని వెల్వడంలో బుధవారం నిర్వహించారు. వెల్వడం సెంటర్‌లోని లకిరెడ్డి బాలిరెడ్డి కాంస్య విగ్రహానికి లకిరెడ్డి సోదరులు గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన సభా కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దివంగత నాయకులు బాలిరెడ్డి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో లకిరెడ్డి పరమేశ్వరీదేవి, ఎల్‌బీఆర్‌సీఈ ట్రస్టు మాజీ చైర్మన్ సచ్చిదానందం, ట్రస్టు అధ్యక్షుడు జీ.శ్రీనివాసరెడ్డి, ఎల్‌బీఆర్‌సీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, పీ గోపాల్, గ్రామ సర్పంచ్ ధర్మరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు యరమల నరసింహారెడ్డి, యరమల శంకరరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ ప్రెసిడెంట్ తోట తిరుపతిరావు పాల్గొన్నారు.



వెల్వడంలో బాలిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. తొలిరోజు విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో డ్రాయింగ్ పోటీలు, ఈ నెల 16న 5,6,7 తరగతులకు వ్యాసరచన పోటీలు, 18న ఇంటర్ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలు, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 19న 8,9,10 తరగతులకు పాటల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేకాక పుస్తక ప్రదర్శన, ప్రముఖుల ఉపన్యాసాలు, కవి సమ్మేళనం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ), హైదరాబాద్ వారి 18వ వార్షికోత్సవాల్లో భాగంగా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను గుర్తించి అక్షరబ్రహ్మ, సేవాబ్రహ్మ పురస్కారాలతో సత్కరించనున్నట్లు అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్. నారాయణ మాస్టారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అక్షర బ్రహ్మ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరిస్తామన్నారు. అలాగే వృద్ధులు, అనాథలు, దివ్యాంగులు వంటి పలు సామాజిక రంగాల్లో సేవలందిస్తున్న సమాజ సేవకులకు 'సేవా బ్రహ్మ' పురస్కారంతో సన్మానిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సేవాతత్పరులు వారు చేస్తున్న సేవా కార్యక్రమాల వివరాలతో ఈ నెల 25వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నెం. 1–20–164, గోకుల్ నగర్, వెంకటాపురం, పోస్టు : తిరుమలగిరి, సికింద్రాబాద్ 15నకు పంపించాలని కోరారు. ఎంపిక చేసిన వారిని వచ్చే నెల 11వ తేదీ ఆదివారం హైదరాబాద్‌లో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా సత్కరిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం 96523 47207కు ఫోన్ చేయాలని కోరారు.

విద్యాసంస్థల బంద్‌కు మిశ్రమ స్పందన

నూజివీడు: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను విరమించుకోవడంతో పాటు కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం పట్టణంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్‌కు మిశ్రమ స్పందన లభించింది. పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ముందు రోజే సెలవు ప్రకటించగా, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు యథావిధిగా తరగతులు నిర్వహించాయి. అలాగే ఒకటి రెండు ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహించాయి. ఈ బంద్‌కు ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటుపరం చేసేందుకు పావులు కదుపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలందరూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి ముందుకు రావాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ ఉపాధ్యక్షుడు కొండబాబు పాల్గొన్నారు.



తిరువూరులో విద్యాసంస్థలు మూసివేయించిన విద్యార్థి సంఘ నాయకులు

తిరువూరులో..

తిరువూరు: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తిరువూరు నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను మూసివేయించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ ల నాయకులు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, మోహనకృష్ణ, సుబానీ, ఉదయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11కేవీ వెంకయ్య స్వామి టెంపుల్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు వెంకయ్య స్వామి టెంపుల్ ఏరియా, సాహితీ విల్లా అపార్ట్‌మెంట్ ఏరియా, శ్రీనివాసనగర్ వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందజేత


ఆగిరిపల్లి: దాతలు దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందజేతకు ముందుకు రావాలని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు అన్నారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో జీ అండ్ జే లక్ష్మీహోమ్స్ ఎల్ఎల్‌పీ ఆర్థిక సాయంతో ఏలూరు జిల్లా ముదినేపల్లికి చెందిన మురాల కిరణ్‌కుమార్‌కు, గుడివాడకు చెందిన కేవీ నరసింహారావుకు, ఆగిరిపల్లి మండలం సూరవరానికి చెందిన జక్కుల మురళీకృష్ణకు, విజయవాడ కృష్ణలంకకు చెందిన మద్దాల మహంకాళ రావుకు, ప్రకాష్ నగర్‌కు చెందిన త్రిపురాన నారాయణరావుకు బుధవారం కృత్రిమ కాళ్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ విశ్రాంత డీఈ యలమంచిలి బాబూరావు, సీనియర్ న్యాయవాది కలపాల వెంకటరమణ, కేసరపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవారావు, సెరేనా మెడోస్ సంస్థ డైరెక్టర్ గుత్తా శ్రీనివాస్, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి పాల్గొన్నారు.



కృత్రిమ కాళ్లను అందజేసిన దాతలు

రేపటి నుంచి రామకోటిలో ప్రత్యేక కార్యక్రమాలు

విజయవాడ కల్చరల్: భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న జగద్గురువులు శృంగేరి పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి సన్యాసాశ్రమం స్వీకరించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఈ నెల 10వ తేదీ నుంచి డిసెంబరు 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ తెలిపారు. రామకోటిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఆదిశంకరులు స్థాపించిన శృంగేరి పీఠం భారతీ సనాతన ధర్మం, వేద సంస్కృతికి కృషి చేస్తుందని తెలిపారు. గురుపరంపరలో సాగే పీఠంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందన్నారు. ఉత్తరాధికారి విధుశేఖర భారతి ఆశీస్సులతో ప్రతి రోజూ జగదుర్గువుల వైభవం అంశంగా ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 10 నుంచి 19 వ తేదీ వరకు శంకర విజయం అంశంగా ఆచార్య శలాక రఘునాథ శర్మ, 20 నుంచి 26 వరకు సురేశ్వరాచార్య మహాస్వామి అంశంగా విశ్వనాథ గోపాల కృష్ణ శాస్త్రి, 27 నుంచి 30వ తేదీ వరకు విద్యారణ్య మహాస్వామి అంశంగా ముదిగొండ శంకరయ్య, డిసెంబరు ఒకటో తేదీ నుంచి 5 వ తేదీ వరకు సచ్చిదానంద నృసింహభారతీ స్వామి వైభవం అంశంగా తంగిరాల రాజేంద్ర ప్రసాద్ శర్మ, 6 నుంచి 12 వ తేది వరకు చంద్రశేఖర భారతీ స్వామి అంశంగా పురాణం మహేశ్వర స్వామి వైభవం, 13 వ తేదీ నుంచి 19వ తేదీ వరకు విద్యాతీర్థ మహాస్వామి అంశంగా 20 వ తేదీ నుంచి 29 వ తేదీ వరకు భారతీ తీర్థ స్వామి అంశంగా ఆధ్యాతిక ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వేద పండితులు వీరుభొట్ల ఫణిశర్మ మాట్లాడుతూ 50 రోజులపాటు నిత్యం పరమేశ్వరుడికి అభిషేకాలు, రుద్రపారాయణం, జరుగుతుందని తెలిపారు. సమావేశంలో గండూరి చంద్రమౌళీశ్వర శర్మ పాల్గొన్నారు.



భారతీ తీర్థ మహాస్వామి సన్యాసాశ్రమ స్వీకార మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు